ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక



# పిల్లలమర్రికి... అందాల భామలు



మహబూబ్ నగర్, (ప్రజా స్వరం) మే 3,: హైదరాబాద్ మే 7 నుండి 31 వరకు 72వ మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వనుంది. 120 దేశాల నుండి 140 మంది పోటీదారులు హాజరుకానున్నారు. తెలంగాణ సంస్కృతిని చాటేలా పర్యాటక ప్రాంతాల సందర్శన, విమానాశ్రయం లో ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోటీల్లో పాల్గొనే అందాల భామలను రాష్ట్రంలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు.తొలుత 21 పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని భావించినప్పటికీ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో మహబూబ్‌నగర్ జిల్లాలోని చారిత్రాత్మక పిల్లల మర్రిని కూడా ఈ జాబితాలో చేర్చారు.హైదరాబాద్ నగరం త్వరలో అంతర్జాతీయ అందాల పోటీలకు వేదిక కానుంది. 72వ మిస్ వరల్డ్ పోటీలు మే 7వ తేదీ నుండి మే 31వ తేదీ వరకు హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి దాదాపు 120 దేశాల నుండి 140 మందికి పైగా పోటీదారులు.. ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈసారి పోటీలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది.విదేశీ అతిథులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటి చెప్పేందుకు పర్యాటక శాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. పోటీల్లో పాల్గొనే అందాల భామలను రాష్ట్రంలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. తొలుత 21 పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని భావించినప్పటికీ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో మహబూబ్‌నగర్ జిల్లాలోని చారిత్రాత్మక పిల్లల మర్రిని కూడా ఈ జాబితాలో చేర్చారు.దీంతో సందర్శించే ప్రాంతాల సంఖ్య 22కు చేరుకుంది. అలాగే.. తొలుత హన్మకొండలోని కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శించాలని అనుకున్నప్పటికీ.. దాని స్థానంలో చారిత్రాత్మక వేయి స్తంభాల గుడిని చేర్చారు. మిగిలిన 20 పర్యాటక ప్రాంతాల్లో ఎలాంటి మార్పులు లేవని అధికారులు స్పష్టం చేశారు. విమానాశ్రయంలో దిగినప్పటి నుండి అతిథులకు తెలంగాణ ఆతిథ్యం.. సంస్కృతిని పరిచయం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో తెలుగు సంప్రదాయానికి అనుగుణంగా బొట్టు పెట్టి,మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలకడానికి తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రత్యేక వేదికను ఏర్పాటు చేస్తోంది. పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ , పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి స్వయంగా విమానాశ్రయాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భద్రతా ఏర్పాట్ల కోసం శంషాబాద్ పోలీసు అధికారులతో సమావేశమై సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ నెల 4వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి అధికారులతో సమావేశమై.. అందాల పోటీల వేదికల వద్ద ఏర్పాట్లు.. విదేశీ అతిథుల బస, వసతి సౌకర్యాలు.. భద్రతా ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించనున్నారు. ఏర్పాట్లను సమన్వయం చేసుకునేందుకు ప్రభుత్వం త్వరలో ఒక ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేయనుంది. ఈసారి మిస్ వరల్డ్ పోటీలు కేవలం అందాల ప్రదర్శనకే పరిమితం కాకుండా.. తెలంగాణ గొప్ప సంస్కృతి, కళలు,పర్యాటక రంగాన్ని ప్రపంచానికి చాటి చెప్పే ఒక గొప్ప వేదికగా మారనుంది.

# నిరుపేదలకే ఇందిరమ్మ ఇల్లు..

**లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి.**
**విడతల వారిగా నిధులు మంజూరు..**

## కలెక్టర్ రాహుల్ రాజ్..





మెదక్ మే 03 (ప్రజా స్వరం): నిరుపేదలకే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శనివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కుల్చారం మండలం వెంకటాపూర్ గ్రామంలో గృహ నిర్మాణ శాఖ, మండల ప్రత్యేక అధికారులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల విచారణ ప్రత్యేక అధికారులతో కలిసి కలెక్టర్ రాహుల్ రాజ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హులైన కుటుంబాలకు న్యాయం జరిగేలా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా నిజంగా అవసరమైన ఇండ్లు లేని పేద కుటుంబాలకు ఇండ్లు ఇవ్వాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. గ్రామ, వార్డు స్థాయిలో అర్హులైన దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించి, వారిని ఎంపిక చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మేరకు లక్ష్యాల వారీగా నిర్దేశించుకొని అర్హుల ఎంపికను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనలో ఎక్కడా కూడా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో సజావుగా సర్వే చేయాలని, ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇల్లు అందేలా చూడాలని స్పష్టం చేశారు. అలాగే సర్వే చేసిన వివరాల పత్రాలను అత్యంత జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. పరిశీలన చేసే క్రమంలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకూడదని, సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ చేయడం జరుగుతుందని ఏదేని అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గ్రామాల వారీగా పరిశీలన పూర్తి కాగానే మొదటి విడత లో ఎంపిక చేసిన అర్హుల జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ప్రదర్శించాలని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు తక్షణమే నిర్మాణం చేపట్టేలా అవగహన కల్పించాలని అన్నారు. విడతల వారిగా నిధులు మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# మహిళా డిగ్రీ కళాశాలలో అదనపు వసతి గదులు : జగ్గారెడ్డి



సంగారెడ్డి ప్రజాస్వరం : సంగారెడ్డిలోని మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్ లో అదనపు వసతి గదులతో పాటు మూడు వందల మంది విద్యార్థినులకు సరిపోయేలా కిచెన్, డైనింగ్ రూమ్ లు మూడు అంతస్తుల్లో ఏర్పాటు అయ్యేలా బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అధికారులకు సూచించారు. శనివారం ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ అధికారులతో టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి పట్టణం లో ఉమెన్స్ డిగ్రీ కళాశాల నిర్మాణ పనుల పురోగతి నీ అడిగి తెలుసుకున్నారు. మహిళా జూనియర్ కళాశాల లో విద్యార్థుల అవసరాల మేరకు మినీ ఆడిటోరియం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల నుంచి వస్తున్న డిమాండ్ దృష్ట్యా మహిళా జూనియర్ కళాశాల కోసం ప్రత్యేక హాస్టల్ భవనం అవసరమని , అందుకు తగ్గ ప్రతిపాదనలు రెడీ చేయాలని సూచించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాత్ రూమ్ ల మరమ్మతులతో పాటు ఇతర మరమ్మత్తుల కోసం కావలసిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, సంగారెడ్డి పట్టణం లో నీ గర్ల్స్ ప్రైమరీ స్కూల్, గర్ల్స్ జూనియర్ కళాశాల, గర్ల్స్ డిగ్రీ కళాశాల లో కావాల్సిన అన్ని మరమ్మత్తులకు పూర్తి చేసేందుకు కావలసిన బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సదాశివపేట పట్టణంలో కేజీబీవీ పాఠశాల లో ఓల్డ్ బ్లాక్ లో మేజర్ మరమ్మత్తుల కోసం సైతం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తోపాజీ అనంత్ కిషన్, కూన సంతోష్, షఫీ, కిరణ్ గౌడ్, మహేష్ లు, ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డీఈ రాజు, ఏ.ఈ లు రాజ మల్లయ్య, లక్ష్మీకాంత్ లు పాల్గొన్నారు.

# మోడీ చిత్రపటానికి పాలాభిషేకం...



మెదక్ మే 03 (ప్రజా స్వరం): కుల జన గణన చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం సంతోషదాయకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్ తెలిపారు. శనివారం కేంద్ర క్యాబినెట్ లో కులగణన జనగణన ఆమోదం చేసినందుకు నరేంద్ర మోడీ చిత్రపటానికి మెదక్ జిల్లా ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మెదక్ జిల్లా పార్టీ కార్యాలయం వద్ద పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల జన గణన చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం సంతోషదాయకమని అన్నారు. మోడీ వల్లే భారత దేశం సమగ్ర అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జ్ రంగుల శంకర్ నేత, జిల్లా ప్రధాన కార్యదర్శిలు శ్రీనివాస్, ఎం ఎల్ ఎన్ రెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ సుభాష్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా నాయకులు నాగరాజు, నాయకులు శ్రీనివాస్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాలో తాగునీటి కోసం జనం తిప్పలు..

## మిషన్ భగీరథ నిర్వహణ లోపంతో ఇక్కట్లు

సంగారెడ్డి (ప్రజా స్వరం) మే 3: వేసవి తాపానికి తోడు తాగునీటికష్టాలతో సంగారెడ్డి జిల్లా వాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఓవైపు ఎండలు మండుతుంటే మరోవైపు గుక్కెడు నీటి కోసం ప్రజలు తిప్పలు పడాల్సివస్తోంది. మిషన్ భగీరథ పథకం నిర్వహణ లోపం ప్రజలకు శాపంగా మారుతుంది. మిషన్‌భగీరథ నిర్వహణ లోపం కారణంగా నారాయణఖేడ్, సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్ నియోజకవర్గాల్లోని గ్రామాలు, తండాల్లోని ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సివస్తోంది. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పలు గ్రామాలు, తండాలకు రెండురోజులకు ఒకమారు తాగునీరు సరఫరా అవుతుంది. దీంతో ప్రజలు, తండావాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిషన్‌భగీరథ ద్వారా తాగునీరు సరఫరా కానిరోజు ప్రజలు వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తుంది. అయితే జిల్లాలో భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. జిల్లాలో 15.47 మీటర్ల లోతుకు భూగర్భజలమట్టాలు చేరుకున్నాయి. కంగ్టి మండలంలో అత్యధికంగా 27 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. దీంతో నారాయణఖేడ్ ప్రాంతంలో భూగర్భజల మట్టాలు తగ్గి వ్యవసాయబోర్లు, తాగునీటిబోర్లు సైతం ఎండిపోతున్నాయి. దీంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సివస్తుంది.

# నేడు నీట్ 2025 పరీక్ష



**2025 – నీట్ పరీక్ష కేంద్రాల పర్యవేక్షణ.**
**పరీక్ష వ్రాయనున్న 487 మంది అభ్యర్థులు**
**నిఘా నేత్రాల మధ్య పరీక్ష..**
**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

మెదక్ మే 03 (ప్రజా స్వరం): కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య నీట్ 2025 పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మే 4 న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నీట్ – 2025 కు మెదక్ జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని ఆయన అదనపు ఎస్పీ మహేందర్, నీట్ పరీక్ష సిటీ కోఆర్డినేటర్ ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్, డీఎస్పీ ప్రసన్నకుమార్, సంబంధిత అధికారులతో సందర్శించి, పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో తరగతి గదులను తనిఖీ చేసి, నిఘా నేత్రాల, జామర్ల పని తీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. 366 మహిళా అభ్యర్థులు, 121 మంది పురుష అభ్యర్థులు మొత్తం – 487 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు వీలుగా తరగతి గదుల్లో బెంచీలు, లైటింగ్, ఫ్యాన్లు, తాగునీరు, మూత్రశాలలు, తదితరాల వంటి మౌలిక వసతులను సమకూర్చాలని సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. తరగతి గదులను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తరగతి గదుల్లో ఎక్కడా కూడా ఎటువంటి కాగితం ఉండటానికి వీల్లేదని ఆదేశించారు. అదే విధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రతను అమలు చేయాలని, ప్రతి అభ్యర్థిని నిశితంగా పరిశీలించాకే పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలన్నారు.

**అభ్యర్థులకు కలెక్టర్ కీలక సూచనలు:** పరీక్ష రోజున (మే 4) ఉదయం 11 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారని, 1:30 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్ లను మూసివేస్తారన్నారు. అభ్యర్థులు బూట్లు ధరించకూడదని, మహిళా అభ్యర్థులు అవసరంలేని ఆభరణాలు ధరించవద్దని, హాండ్ కర్చీఫ్, మొబైల్ ఫోన్లు, వాచ్, బెల్ట్, పెన్, పెన్సిల్, రబ్బర్, శార్పనర్, ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రంలోకి అనుమతి లేదని స్పష్టం చేశారు. అలాగే పరీక్ష అడ్మిట్ కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని, దానిపై గల పరీక్ష కేంద్రం వివరాలను సరైన విధంగా సరి చూసుకోవాలని, సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. ఈ పర్యవేక్షణలో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



**కోర్టు ఏర్పాటు కోసం**

# బిల్డింగ్ పరిశీలన



తూప్రాన్, మే 3, ప్రజాస్వరం : మెదక్ జిల్లా తూప్రాన్ డివిజన్ కేంద్రంలో కొత్తగా కోర్టును ఏర్పాటు చేసేందుకు శనివారం జిల్లా జడ్జి నీలిమ ఎంపీడీవో ఆఫీస్ బిల్డింగు ను అధికారులతో కలిసి పరిశీలించారు. పాత మండల ఆఫీస్ దగ్గర ఉన్న ఎంపీడీవో కార్యాలయం బిల్డింగ్ కోర్టు ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని అన్నారు. కోర్టు కోసం కావాల్సిన ఏర్పాట్లను వాటికి అయ్యే ఖర్చు గురించి అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, డి.ఎస్.పి వెంకటరెడ్డి, ఎస్ఐ శివానందం, ఎమ్మార్వో విజయలక్ష్మి, ఎంపీడీవో శేషాద్రి, మెదక్ బార్ అసోసియేషన్ డిస్టిక్ ప్రెసిడెంట్ మర్కంటి రాములు,లాయర్లు శ్రీనివాస్, శివ, అశోక్ తదితరులున్నారు.

# 500 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయాలి

**రైతులకు ఇబ్బందులులేకుండా కొనుగోలు చేపట్టాలి**
**తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి**



తూప్రాన్, మే 3, (ప్రజాస్వరం) :రైతుల వద్ద నుండి ఒక్కొక సెంటర్ లో ప్రతిరోజు 500 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని చూపులను తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం తూప్రాయం మండలం యావాపూర్ లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సెంటర్ నుండి ప్రతి రోజుకు 500 క్వింటాళ్ల ధాన్యాన్ని తూకం వేసి కొనుగోలు చేయాలని. తూకం వేసిన వెంటనే రైస్ మిల్లులకు పంపించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేపట్టాలన్నారు. ఎమ్మార్వో విజయలక్ష్మి తదితరులున్నారు.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

# మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్



## ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలి


**పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ సృజన**
**వికారాబాద్ జిల్లాలో క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన**



వికారాబాద్, మే 3 (ప్రజా స్వరం) : ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టాలని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ సృజన అధికారులకు సూచించారు. వికారాబాద్ జిల్లా మోమిన్ పేట, నవాబ్ పెట్ మండలాల్లో శనివారం జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో కమీషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో ముఖాముఖిగా మాట్లాడుతూ... ఉపాధి హామీ పథకం కింద ఎన్ని రోజులు పని చేస్తున్నారని, రోజుకు 307 రూపాయల చొప్పున చెల్లిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కింద పొలాలకు కట్టలు వేసుకోవడమే కాకుండా చెక్ డ్యామ్ ల నిర్మాణాలను పెద్ద మొత్తంలో చేపట్టలని ఆమె అధికారులు సూచించారు. ఆదాయ వనరులు కల్పించే పంటలు సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని ఆమె సూచించారు. ఉద్యానవన పంటలతో పాటు మునగ, జామ , మామిడి, సీతాఫల్ పంటలను సాగు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని ఆమె అధికారులు సూచించారు.పంచాయతి రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ పర్యటన భాగంగా అవెన్యూ ప్లాంటేషన్, కాంపోస్ట్ షెడ్, ఫాం పాండ్ నిర్మాణ పనులు పరిశీలించారు. నవాబ్ పెట్ మండలంలో ఉపాధి హామీ కింద నిధులతో చేపట్టిన పౌల్ట్రీ ఫాం ను కమిషనర్ ప్రారంభించారు. కమిషనర్ పర్యటనలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సుధీర్, డిఆర్డిఓ శ్రీనివాస్, డిపిఓ జయసుధ, పంచాయత్ రాజ్ ఉమేష్, ఎంపీడీఓ లు విజయలక్ష్మి, అనురాధ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం సేకరించేందుకు చర్యలు

**- జిల్లాలోని 129 కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణ**
**- జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్**




వికారాబాద్, మే 3 (ప్రజాస్వరం): జిల్లాలోని ప్రతి కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు.శనివారం వరి ధాన్యం కొనుగోలు పై పౌరసరఫరాల అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్ష అదనపు కలెక్టర్ ఛాంబర్ లో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలోని 129 కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. రైతులు కష్టపడి పండించిన పంట వర్షాల ధాన్యం తడిసిపోకుండా కావలసిన తాడిపత్రీలు, సంచులను అందుబాటులో ఉంచుకోవాలని ఆయన తెలిపారు. తూనిక, తేమ యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లర్లకు చేరవేయాలని ఆయన తెలిపారు. ధాన్యాన్ని సేకరించేందుకు హమాలీలను పెంచుకోవాలని సూచించారు. ధాన్యం రవాణా చేసేందుకు వాహనాలను సిద్ధం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, మార్కెటింగ్ ఏడి సారంగపాణి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, జిల్లా సహకార అధికారి నాగార్జున, డీసీఎంఎస్ అధికారి శ్యామ్ సుందర్ రెడ్డి, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## సిటిజన్ కానిస్టేబుల్స్...

హైదరాబాద్, మే 3,: రాంగ్‌రూట్‌లో వెళ్తే ట్రాఫిక్ పోలీస్ ఫోటో కొట్టి ఫైన్ వేయడం మనకు తెలిసిన విషయమే. అయితే ఎక్కడైనా ట్రాఫిక్ పోలీస్ లేడని తెలిస్తే మాత్రం వాహనదారులు మొత్తం ఇష్టం వచ్చినట్లు వెళ్తూ ఉంటారు. రాంగ్ రూట్‌లో వెళ్లి ప్రమాదాలకు కారణమైన వారిని మనం నిత్యం చూస్తూనే ఉంటాం. అందుకే ఇప్పుడు ట్రాఫిక్ పోలీసులు కొత్త రూల్ తీసుకువచ్చారు. రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనదారులను ఎవరైనా ఫోటో తీసి పంపిస్తే.. అలాంటి వారికి జరిమానాలు వేసే నిర్ణయం తాజాగా అమల్లోకి వచ్చింది.హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ వాహనాలు పెరిగిపోతూనే ఉన్నాయి. అదే సమయంలో ట్రాఫిక్ కూడా నిత్యం పెరుగుతూనే ఉంది. ఇక ట్రాఫిక్ ఉల్లంఘించి వెళ్లే వాహనదారుల సంఖ్య కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. దీంతో ఎక్కడికక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు.. అందులో రాంగ్ రూట్ కారణంగా జరిగే ప్రమాదాలు, మరణాల సంఖ్య ఎక్కువగా ఉండటం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు.. రాంగ్ రూట్‌లో వెళ్లే వాహనదారుల భరతం పట్టేందుకు సిద్ధం అయ్యారు. ఎవరైనా రాంగ్ రూట్‌లో వెళ్తే వారికి జేబులు చిల్లులు పడేలా ఫైన్లు వేస్తున్నారు. అయితే ఇదంతా ట్రాఫిక్ పోలీసులు ఉండే జంక్షన్ల మాత్రమే ఇప్పటివరకు ఉండేది. కానీ ఇక నుంచి సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇలాంటి రాంగ్ రూట్ డ్రైవింగ్ లేకుండా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.ఇందులో భాగంగానే ట్రాఫిక్ పోలీస్ లేని ప్రాంతాల్లో రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనదారుల ఫోటోలు తీసే అధికారాన్ని సాధారణ ప్రజలకు, వాహనదారులకు కల్పించారు. ఎవరైనా రాంగ్ రూట్‌లో వెళ్లినట్లు గమనిస్తే.. వారి వాహనం ఫోటో తీసి తమకు పంపిస్తే.. అలాంటి వారికి ఫైన్లు విధిస్తామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కొత్త రూల్ తీసుకువచ్చారు. ఈ క్రమంలోనే సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక ఆసక్తికరమైన ట్వీట్ పెట్టారు. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించి రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాల ఫోటోలు, వీడియోలు తీసి పంపాలని విజ్ఞప్తి చేశారు. అలాంటి ఫోటోలు వీడియోలను తమ వాట్సాప్ నెంబర్ 9490617346కు పంపించాలని.. వాటితోపాటు ఆ వాహనం లొకేషన్, టైమ్, డేట్ వంటి పూర్తి వివరాలను పంపించాలని ట్వీట్‌లో సూచించారు.పంపిన వివరాలను సేకరించి.. ట్రాఫిక్ నియమాలను అతిక్రమించి.. రాంగ్ రూట్‌లో వెళ్లిన వాహనదారులకు జరిమానాలు విధించి.. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ముక్కుపిండి వసూలు చేయనున్నారు. మే 1వ తేదీ నుంచే ఈ కొత్త నిబంధన అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. రాంగ్ రూట్‌లో వాహనదారులు ప్రయాణాలు చేయకుండా ఉండేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తీసుకువచ్చిన ఈ రూల్‌కు సంబంధించిన ట్వీట్‌కు నెటిజన్లు మద్దతు తెలుపుతూ రీట్వీట్లు, కామెంట్లు చేస్తున్నారు.

## చీరాల - సికింద్రాబాద్ బస్సు ప్రారంభం



మేడ్చల్ / కీసర మే 3, (ప్రజా స్వరం) : సామాన్య ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ముందుంటుందని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్,రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ లు అన్నారు. కీసర మండలం చీరాల నుండి సికింద్రాబాద్ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కీసర మండల, చీరాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు విజ్ఞప్తి చేయడంతో ఈ విషయాన్ని రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ రి దృష్టికి తీసుకువెళ్లామని అయన వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలు ఇచ్చి బస్సు మంజూరు చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమాభివృద్ధికే భూ భారతి

**చేవెళ్ల ఎమ్మెల్యే "కాలే యాదయ్య"**



వికారాబాద్, మే3 (ప్రజాస్వరం):వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన లిభూ భారతి చట్టం పై రైతులకు అవగాహన సదస్సు లో చేవెళ్ల స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతుల సంక్షేమాభివృద్ధి కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందన్నారు. భూవివాదాల సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం ఎంతగానో దోహదపడుతుందన్నారు.అనంతరం ఎమ్మెల్యే నవాబ్ పేట్ మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన రూ.3,06,000/- (రూ. మూడులక్షల ఆరువేలు)విలువ గల 8 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, రైతులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ ఉచ్చులో చదువుకున్నవాళ్లే ఎక్కువ




హైదరాబాద్, మే 3,: హైదరబాద్ మియాపూర్‌కు చెందిన 40 ఏళ్ల ఐటీ ఉద్యోగి, ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఓ యాడ్ ద్వారా ట్రేడింగ్ స్కామ్‌కు గురై ?38.62 లక్షలు కోల్పోయాడు. వ్యాపారంలో ?1.3 కోట్లు లాభాలుగా చూపించినా, అతని ఖాతాలో జమయిన మొత్తం కేవలం ?200 మాత్రమే. ఈ కేసును సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.బాధితుడు మొదట ఓ వాట్సాప్ గ్రూప్‌లో చేరాడు. ఈ గ్రూప్‌లో "ప్రియా శర్మ"గా తాను పరిచయం చేసుకున్న యువతి అతనికి ట్రేడింగ్ గురించీ, అధిక లాభాలు పొందే పద్ధతుల గురించీ వివరించింది. ఆమె అతనికి "యాఐ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ" అనే యాప్ ఉపయోగించమని సూచించింది. దీనివల్ల బ్లాక్ ట్రేడ్స్, అప్‌పర్ సర్క్యూట్ స్టాక్స్ వంటి విషయాల్లో మోహపూరితమైన వ్యూహాలతో అతన్ని పెట్టుబడి పెట్టించేందుకు ప్రోత్సహించిందివాట్సాప్ గ్రూప్‌లో వేరే సభ్యుల ద్వారా ఇచ్చిన టెస్ట్‌మోనియల్స్, స్క్రీన్‌షాట్‌లతో ఆకర్షితుడైన బాధితుడు తొలుత ?50,000 పెట్టుబడి పెట్టి, తరువాత నెమ్మదిగా పెంచుతూ మొత్తం ?14.87 లక్షలు పెట్టాడు. మొత్తంగా అతను తన ఖాతా మరియు భార్య ఖాతా ద్వారా ?38.62 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశాడు.ట్రేడింగ్ జరుగుతున్న సమయంలో ప్రియా అతనికి ?1 కోటి లాభాలు వచ్చాయని చెప్పింది. కానీ, ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకునేందుకు ముందు, ?18 లక్షలు ట్యాక్స్ క్లియరెన్స్ పేరుతో డిమాండ్ చేసింది. బాధితుడు ఈ మొత్తం తన లాభాల నుంచి తీసుకోమని అడిగినప్పుడు, ఆమె దానికి అంగీకరించకుండా.. ట్యాక్స్‌ను వేరుగా చెల్లించాల్సిందేనని చెప్పింది.ఇంకొక సంఘటనలో, హైదరాబాద్‌కు చెందిన 55 ఏళ్ల వ్యక్తిని ఇండియామార్ట్ అనే వాణిజ్య వెబ్‌సైట్‌లో ట్రాన్స్మిషన్ లైన్ టూల్స్ కోసం వెతుకుతున్న సమయంలో, మోసగాళ్లు ?1,17,646కు మోసగించారు. జూ ఎంటర్‌ప్రైజెస్ అనే పేరుతో పర్సనల్ జాయింట్ అకౌంట్‌కు చెందినట్లుగా తమను పరిచయం చేసుకున్నారు. బాధితుడికి ఫోన్లో మాట్లాడి పర్చేజ్ ఆర్డర్ పంపించారు.ఏప్రిల్ 5న ?1,17,646 చెల్లింపును బాధితుడు చేశాడు. అయితే అప్పటి నుంచి అతనికి ఎటువంటి సరుకు రాలేదు. ఫాలో అప్‌లో, మోసగాళ్లు వాట్సాప్ ద్వారా మరిన్ని నకిలీ రసీదులు, షిప్పింగ్ డాక్యుమెంట్లు పంపించారు.సిటీ సైబర్ క్రైమ్ ఏసీపీ శివ మారుతి మాట్లాడుతూ, "బాధితుల ఫిర్యాదుల ఆధారంగా మోసగాళ్లను గుర్తించే పనిలో ఉన్నాం" అన్నారు. ఇలాంటి నేరు జరిగినప్పుడు వెంటనే 1930 నెంబర్ కు కాల్ చేయాల్సిందిగా పోలీసులు సూచిస్తున్నారు

## నేడు అంతర్జాతీయ అగ్నిమాపక సిబ్బంది దినోత్సవం




వికారాబాద్, మే 3 (ప్రజాస్వరం): అంతర్జాతీయ అగ్నిమాపక సిబ్బందిని అంతర్జాతీయంగా వారి సేవకు గౌరవించటానికి, సేవలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందిని స్మరించుకోవడానికి మరియు సెప్టెంబర్ 11 దాడులలో మరణించిన అగ్నిమాపక సిబ్బందిని స్మరించుకోవడానికి మే 4 న అంతర్జాతీయ అగ్నిమాపక దినోత్సవం జరుపుకుంటారు . 2 డిసెంబర్ 1998న ఆస్ట్రేలియాలో బుష్‌ఫైర్‌తో పోరాడుతున్న ఐదుగురు అగ్నిమాపక సిబ్బంది మరణించిన తర్వాత, జనవరి 4, 1999న ఆస్ట్రేలియన్ అగ్నిమాపక సిబ్బంది, జేజే ఎడ్మండ్‌సన్ చేసిన ప్రతిపాదన తర్వాత ఇది స్థాపించబడింది . డిసెంబరు 2 , 1998న, ఆస్ట్రేలియాలోని విక్టోరియాలోని లింటన్ నుండి అడవి మంటలతో పోరాడుతున్న ఇతర అగ్నిమాపక సిబ్బంది సహాయం కోసం గీలాంగ్ వెస్ట్ ఫైర్ బ్రిగేడ్ యొక్క అగ్నిమాపక సిబ్బంది ప్రతిస్పందించారు . వాటర్ ట్యాంక్‌ను రీఫిల్ చేయడానికి మార్గంలో ఉన్న చలి కారణంగా గాలి దిశలో అకస్మాత్తుగా మార్పు రావడంతో అగ్నిమాపక ట్రక్‌లో మంటలు చెలరేగాయి. ఫలితంగా, ఐదు గీలాంగ్ వెస్ట్ అగ్నిమాపక సిబ్బంది మరణించారు: గ్యారీ వ్రెడెవెల్ట్, క్రిస్టోఫర్ ఎవాన్స్, స్టువర్ట్ డేవిడ్సన్, జాసన్ థామస్ మరియు మాథ్యూ ఆర్మ్‌స్ట్రాంగ్. ఈ సంఘటన చివరికి అంతర్జాతీయ అగ్నిమాపక దినోత్సవం కోసం ప్రతిపాదనకు దారితీసింది. అంతర్జాతీయ అగ్నిమాపక సిబ్బంది దినోత్సవంలో భాగంగా మే మొదటి ఆదివారం నాడు స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం "సౌండ్ ఆఫ్" జరుగుతుంది . ఇందులో 30 సెకన్ల పాటు ఫైర్ సైరన్‌లను ఆన్ చేయడం మరియు విధి నిర్వహణలో మరణించిన అగ్నిమాపక సిబ్బంది అందరినీ స్మరించుకోవడానికి ఒక నిమిషం పాటు మౌనం పాటించడం ఉంటుంది. సౌండ్ ఆఫ్ 2002లో ప్రారంభమైంది మరియు ఏటా కొనసాగుతుంది. అగ్ని నివారణ మరియు మరింత ఇంటెన్సివ్ మరియు క్షుణ్ణంగా శిక్షణ అవసరం అంతర్జాతీయ అగ్నిమాపక సిబ్బంది దినోత్సవం ద్వారా ప్రచారం చేయబడుతుంది మరియు నైపుణ్యాలు మరియు అవగాహన రెండింటినీ పెంచడానికి ఈ రోజు ఒక ముఖ్యమైన అవకాశంగా పరిగణించబడుతుంది . ఎరుపు మరియు నీలం రంగు రిబ్బన్ అనేది అంతర్జాతీయ అగ్నిమాపక సిబ్బంది దినోత్సవం కోసం ఉపయోగించే చిహ్నం, రిబ్బన్ 5 సెం.మీ (2 అంగుళాలు) పొడవు మరియు 1 సెం.మీ (0.39 అంగుళాలు) వెడల్పు, రెండు వేర్వేరు రంగులు పైభాగంలో కలిసి ఉంటాయి. రిబ్బన్ యొక్క ఎరుపు అగ్నిని సూచిస్తుంది, అయితే నీలం నీటిని సూచిస్తుంది. రిబ్బన్ సాంప్రదాయకంగా ఒడిలో ధరిస్తారు కానీ లాపెల్‌కు మాత్రమే పరిమితం కాదు.

## నా చివరి శ్వాస వరకు పోరాటం చేసైనా దాన్ని పూర్తి చేస్తా : షబ్బీర్ అలీ



కామారెడ్డి : నా జీవితకాలపు చిరకాల కోరిక ప్రాణహిత చేవెళ్ల (కాళేశ్వరం) అని, నా చివరి శ్వాస వరకు పోరాటం చేసైనా దాన్ని పూర్తి చేస్తానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ప్రాణహిత చేవెళ్ల ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడారు. కామారెడ్డి రైతులకు శాశ్వత సాగు నీటి పరిష్కారం చూపిస్తానన్నారు. కామారెడ్డి రైతుల కళ్ళల్లో ఆనందం చూసిన తర్వాతే తను కన్నుమూస్తానని పేర్కొన్నారు. ప్రాజెక్టు కోసం 23 కోట్ల రూపాయలు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఫైనాన్స్ మినిస్టర్ భట్టి విక్రమార్కలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్లను కాళేశ్వరం గా మార్చిదని, పూర్తిగానే రద్దు చేయాలని కుట్ర పన్నారన్నారు. దానిని లిఫ్ట్ ఇరిగేషన్ గా మార్చి దీని ద్వారా పేద రైతుల 3.5 టీఎంసీ నీటి పరిధి తో వందల ఎకరాల భూములు కోల్పోవాల్సి వస్తుందన్నారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వం లో 10 కోట్లు కూడా మంజూరు చేయలేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తిరిగి పాత డిజైన్ ప్రకారమే ముందుకు వెళ్తున్నామని, దీని ద్వారా 2.8 టీఎంసీ సాగునీరు అందుతుందన్నారు. పాత డిజైన్ ప్రకారం రైతులు కూడా భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చారన్నారు. ప్రాణహిత చేవెళ్ల (కాళేశ్వరం) పనులు, భూసేకరణ, ఇతరత్రా ఇబ్బందులను త్వరగా సమీక్షించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు 80% వరకు నష్టపరిహారం అందించడం జరిగిందని, కేటాయించిన 23 కోట్ల 15 లక్షల తో 100% నష్టపరిహారం అందించి పదిహేను రోజుల్లోపు పనులు ప్రారంభిస్తామన్నారు. దీంతో కామారెడ్డి నియోజకవర్గానికి 80 వేల ఎకరాలు, బాన్సువాడకు పదివేల ఎకరాలు, ఎల్లారెడ్డి కి 30 వేల ఎకరాలు, మెదక్ జిల్లా రామాయంపేటకు 12 ఎకరాలు సాగునీటిని అందిస్తామన్నారు. కాంగ్రెస్ హయాంలోనే పూర్తి చేసి చూపిస్తామన్నారు. అలాగే గోదావరి జలాలు పూర్తిస్థాయిలో పైప్ లైన్లు మరమ్మతు చేసి కొత్త పైప్ లైన్ వేసి 20 సంవత్సరాల వరకు తాగునీటి కొరత రాకుండా చూస్తామన్నారు. వేసవికాలం వస్తున్నందున నీటి ఎద్దడి ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాలు, మునిసిపాలిటీల్లో ప్రజాప్రతినిధుల పదవి కాలం పూర్తవడంతో ప్రజా ప్రతినిధులైనా, అధికారులైనా ఇప్పుడు మీరేనని, గ్రామాల్లో ఎలాంటి సమస్యలైనా పై అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. విధుల్లో అలసత్వం వహించి ప్రజలకు అందుబాటులో ఉండకుండా అసౌకర్యం కల్పిస్తే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడుతూ...అమృత్ కాల్ పథకంలో 93 కోట్ల రూపాయలతో తాగునీటి పనులు సమీక్ష జరపగా (గోదావరి జలాలు) 104 కిలోమీటర్ల నుంచి రెండో పైపులైన్ పనులు ఇప్పటివరకు 24 కిలోమీటర్ల వరకు పూర్తయ్యాయన్నారు. మరో రెండు నెలల్లో రెండో లైను పూర్తవుతుందన్నారు. ఫారెస్ట్ పర్మిషన్లు ఇబ్బంది ఉంటే వెంటనే పై అధికారులతో మాట్లాడి పర్మిషన్లు వారంలో వచ్చేలా చూస్తామన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో మిషన్ భగీరథ ద్వారా 7200 ఉచిత నల్లా కలెక్షన్లు కొత్తవి ఇస్తున్నామన్నారు. ఈ వారంలో మొదలవుతాయని చెప్పారు. స్లమ్ ఏరియాల్లో ఎక్కువ కలెక్షన్లు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని గ్రామాలతో కలిపి 11 ఎంఎల్డీ నీరు అవసరం ఉండగా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుండి 6 ఎం ఎల్డీ, బుర్ర మత్తడి నుంచి 1 ఎంఎల్డీ పెద్ద చెరువు నుండి 2.5 ఎం ఎల్డీ నీరు వస్తున్నాయన్నారు. రెండవ లైన్ పూర్తి అవుతే ఎలాంటి నీటి సమస్యలు ఉండవన్నారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడుతూ...వేసవి కాలంలో పట్టణంలో నీటి ఎద్దడి ఏర్పడకుండా ట్యాంకర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.